క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దాత శ్రీరాంరెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు శ్రీరాంరెడ్డి ఉచితంగా నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి, రమేశ్, పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు అలివేలు, గ్రామస్తులు సుభాష్ రెడ్డి, బందయ్య, నర్సింలు, మల్లేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

స్టేషనరీ అందజేత



విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న కళాశాల చైర్మన్ గాయత్రి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల చైర్మన్ గాయత్రి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీని ఆమె కళాశాల తరఫున అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి ఠాగూర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



ఫర్టిలైజర్ షాపులో స్టాక్ పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

మొయినాబాద్: మున్సిపల్ కేంద్రంలోని సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఏడీఏ శోభారాణి, ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్, సీడ్ సర్టిఫికేషన్ ఏడీఏ శివకుమార్ టాస్క్‌ఫోర్ బృందంగా వచ్చి మొయినాబాద్‌లోని నాలుగు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ సరిగా నిర్వహిస్తున్నారా.. అనుమతి లేని విత్తనాలు, ఫర్టిలైజర్, పురుగు మందులు ఏమైనా విక్రయిస్తున్నారా అనే విషయాలను పరిశీలించారు. రైతులకు బిల్లులు సరిగా ఇస్తున్నారా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని.. రికార్డులు సరిగా నిర్వహించాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి అనురాధ ఉన్నారు.

హామీల అమలులో విఫలం

ఉద్యమకారుడు ఆంజనేయులు



శాంతియుత దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులు, నాయకులు

శంకర్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉద్యమకారుడు దేశమల్ల ఆంజనేయులు అన్నారు. సోమవారం పట్టణ చౌరస్తాలో ఉద్యమకారులు శాంతియుత దీక్ష చేపట్టగా ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ఉద్యమకారుల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపు మేరకు రిలే నిరాహార దీక్ష చేపట్టామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. 250 గజాల స్థలం ఇస్తామని చెప్పి మరిచిపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులను గుర్తించి, ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, సంఘం మండల అధ్యక్షుడు అశోక్, పండిత్‌రావు, మాణయ్య, శ్రీనివాస్, వీరారెడ్డి, పద్మ, గౌరీ, మంజుల పాల్గొన్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

- వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు నీటికుంటల నిర్మాణం
- భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం
- మండలానికి 32 మంజూరు
- పాంపాండ్స్‌పై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



వ్యవసాయ పొలాల్లో నిర్మించే నీటికుంట నమూనా చిత్రం

కొత్తూరు: భారీ వర్షాలు కురిసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు అంతగా పెరగడం లేదు. నీటి ఎద్దడి సమయాల్లో వ్యవసాయ రంగం ఒడిదుడుకులకు గురవుతోంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించడంతో పాటు ఎక్కడి నీటిని అక్కడే భూమిలోకి ఇంకించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి కుంటల(సేద్యపు కుంటలు) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పథకం ఆశయం బాగున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆశించిన ఫలితాలు లేవు. దీంతో వర్షపునీరు వ్యవసాయ పొలాలను దాటి రోడ్లపై, కాల్వల్లో వృథాగా పారుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పథకం లక్ష్యం గురించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే చక్కని ఫలితాలు ఉంటాయి.

పనులపై అనాసక్తి..

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని భావించిన ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించింది. సాగునీటి ప్రధాన కాల్వలు, ఉప కాల్వల్లో పూడిక తీయడం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ఇంకుడు గుంతలతో పాటు పొలాల్లో నీటి కుంటల నిర్మాణాలు అనుసంధాన ప్రక్రియలో ప్రధానమైనవి. వీటితో కూలీలకు పని లభించడమే కాకుండా భూగర్భజలాలు పెరిగి పంటల దిగుబడి మరింత పెరగడానికి దోహదపడుతుంది. కాగా గతంలో కొత్తూరు మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు 32 నీటి కుంటలను మంజూరు చేశారు. మల్లాపూర్‌లో 2, కొడిచర్లలో 4, శేరిగూడకు 6, సిద్ధాపూర్ గ్రామానికి 20 నీటి కుంటలు మంజూరయ్యాయి. నాలుగేళ్లు గడుస్తున్నప్పటికీ పలుచోట్ల పనులే ప్రారంభం కాలేదు. సిద్ధాపూర్‌లో 2, కొడిచర్లలో 2 కుంటల నిర్మాణాలను చాలా తక్కువ కొలతలతో రైతులు పూర్తిచేశారు. ఎస్‌బీపల్లిలో మాత్రం 06 కుంటలు పలు నిర్మాణ దశలో పనులు ఆగిపోయాయి.

అవగాహన ఎక్కడ?

నీటి కుంటల నిర్మాణాలు, వాటితో కలిగే ప్రయోజనాల గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాల్సిన యంత్రాంగం ఈ అంశంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. అందువల్ల రైతులు కూడా తెలిసీ తెలియని పరిజ్ఞానంతో కుంటల నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు నిర్మించుకునే నీటి కుంటలకు ప్రభుత్వం కుంటల కొలతలను బట్టి చిన్నకారు, పెద్ద రైతులకు రూ.15వేల 200ల నుంచి 2 లక్షల 90వేల వరకు ఖర్చు చేస్తోంది. దీంతో ఐదెకరాలు ఉన్న చిన్న రైతులు, అంతకంటే ఎక్కువ పొలం ఉన్న రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవచ్చు.

స్థలం అనువుగా ఉంటే చాలు..

ఏ పొలంలోనైనా వర్షపు నీరు ఏదో మూలకు చేరుతుంది. నీరు నిల్వ చేయడానికి అవకాశం ఉన్న రైతుల పొలాల్లోని పల్లపు ప్రాంతాన్ని పని ప్రదేశంగా గుర్తించి నిర్మాణం చేపడుతారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతీ రైతు నీటి కుంటలను నిర్మించుకునేందుకు అర్హులు. పొలంలో అనువుగా ఉన్న స్థలాన్ని బట్టి కుంటలను నిర్మిస్తారు. కుంటల నిర్మాణం పూర్తయితే పొలంలో నుంచి పారే వరద నీరంతా కుంటలోకి చేరుకునే వీలుంటుంది. పశువులు, పక్షులకు ఆ నీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా పొలంలోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం మరింతగా పెరుగుతుంది.

అందరూ సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇంకుడు గుంతలు, పాంపాండ్స్ నిర్మించుకోవడానికి రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భజలాలు మరింత పెరుగుతాయి. ఈ పథకంలో భాగంగా చేపడుతున్న పనులపై రైతులు, ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను చేపట్టేందుకు కృషిచేస్తాం.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక విజ్ఞానాన్ని పెంపొందించేందుకు పాఠశాలలో మాక్ పోలింగ్(నమూన ఎలక్షన్) నిర్వహించామని ఎన్నికల కమిషనర్, అధికారి, గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ మాలతీ పేర్కొన్నారు. సోమవారం చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కూల్ కౌన్సిల్ ఎలక్షన్ 2025–26 విద్యాసంవత్సరానికి గాను విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారిగా ప్రణీత, ఎలక్షన్ కమిషన్ సభ్యులుగా మాలతీ, వాణి, నిక్కత్ జహాన్ పనిచేశారు. ఎన్నికలకు రెండు బూత్‌లు ఏర్పాటు చేయగా.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలు స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, కల్చరల్ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లిటరసీ సెక్రటరీల కోసం నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎన్నికల్లో 95 శాతం మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు రిపోర్టర్లుగా ఏర్పడి ఇంటర్వ్యూ చేసిన దానిలో సమాధానం ఇచ్చారని, ఎన్నికలు జరుగుతున్న సమయంలో పోటీలో పాల్గొన్న విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూశారన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసమే ఈ ఎన్నికలు నిర్వహించామని సిబ్బంది పేర్కొన్నారు.

మెకానిక్ షెడ్ యజమానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న మెకానిక్ యూనియన్ నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని పాత జాతీయ రహదారిపై ఉన్న గణ గ్యారేజ్(కారు మెకానిక్ షెడ్డు)లో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సందర్భంగా నష్టపోయిన గ్యారేజ్ యజమాని గణేష్‌యాదవ్‌కు తోటి మెకానిక్‌లు అండగా నిలిచారు. సోమవారం కారు మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు శ్రావన్ ఆధ్వర్యంలో ఆయనకు రూ.80వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం శ్రావణ్ మాట్లాడుతూ.. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరగడంతో షెడ్డు పూర్తిగా కాలిపోయిందన్నారు. ఈ ప్రమాదంలో నష్టపోయిన గణేష్‌యాదవ్‌ను ఆదుకునేందుకు యూనియన్ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కారు మెకానిక్ యూనియన్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



రావులపల్లిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి నాయకులు, ప్రజలు పార్టీలకతీతంగా కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని రావులపల్లి గ్రామ చౌరస్తాలో రావులపల్లి–సంకేపల్లి గ్రామాల మధ్య రూ.2.50కోట్లతో నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులు, రూ.55లక్షలతో సంకేపల్లి చౌరస్తా నుంచి గ్రామం వరకు చేపట్టే సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు.. పనులు ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్, ఏఈ నంద కిశోర్, ఎంపీఓ గిరిరాజు, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

చేవెళ్ల: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలోని చంద్రారెడ్డినగర్‌లో గల పోచ మ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాలు సోమ వారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, సమత దంపతుల కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘ నంగా జరిగాయి. ఈ పూజల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వివరాలు అందించాలి

మండల వ్యవసాయాధికారి శిరీష



ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న ఏఓ శిరీష

కేశంపేట: రైతులకు గుర్తింపు కార్డులను అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహిస్తోందని మండల వ్యవసాయ అధికారి శిరీష అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని వేములనర్వలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని రిజిస్ట్రేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో రైతులకు గుర్తింపు కార్డులను అందిస్తుందన్నారు. వ్యవసాయ అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో పాటుగా ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్‌తో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వినయ్, రైతులు పాల్గొన్నారు.

జైసంవిధాన్ సభను జయప్రదం చేయండి

చేవెళ్ల: ఈ నెల 4వ తేదీన ఎల్బీ స్టేడియంలో జరిగే జైబాపు, జైభీం, జైసంవిధాన్ సభను జయప్రదం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆయన మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సభకు చేవెళ్ల నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, భీమయ్య, మోహన్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, గోపాల్‌రెడ్డి, శంకర్, యాదయ్య, విజయ్, రవీందర్ రెడ్డి, నరేందర్, మహేశ్, ప్రభాకర్, జనార్దన్, రాములు, జహంగీర్, పాష తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కడ్తాల్: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ సంఘాలు చేసిన పోరాట ఫలితంగానే కేంద్రం ప్రభుత్వం దిగివచ్చి, త్వరలోనే దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని ప్రకటించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి, రిజర్వేషన్లు సాధించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీలకు జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు హెచ్‌ఆర్ మహేశ్, రాజేందర్‌గౌడ్, మహేశ్, ఉపేందర్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 8 అర్జీలు

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఇబ్రహీంపట్నం డివిజన్ స్థాయి ప్రజావాణిలో 8 అర్జీలు అందాయని ఆర్డీఓ అనంత రెడ్డి తెలిపారు. భూ సమస్యలపై ఏడు, ఇంటి నిర్మాణానికి సంబంధించి ఒక దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులకు అర్జీలను పంపి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో ఎలాంటి మౌలిక వసతులు అవసరం ఉన్నా మున్సిపల్, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడూ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, మురుగు కాలువలు, రోడ్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కాలనీలలో ప్రజలకు కావాల్సిన అవసరాలను గుర్తించి వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మాజీ కౌన్సిలర్లు నడికూడ సరిత, శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్, మున్సిపల్ ఏఈలు రాయుడు, సాయి, నాయకులు కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, జమ్రుద్‌ఖాన్, మాధవులు, అర్జున్‌లక్ష్మణ్, విజయ్‌కుమార్, యాదగిరియాదవ్, శ్రీధర్, రమేశ్, వెంకటేశ్, నర్సింలుయాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మీడియా సంస్థలపై బెదిరింపులు సరికాదు

- ఫోన్ ట్యాపింగ్‌తో ఎంతోమంది జీవితాలతో ఆడుకున్నారు
- ఎమ్మెలే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: మీడియా సంస్థలపై దాడులు చేస్తామని మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ఒక వీధి రౌడిలా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో మీడియా ఫోర్త్ ఎస్టేట్‌గా నిలిచిందన్నారు. అలాంటి మీడియాపై దాడులు చేస్తామనడం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో మీడియా కీలక పాత్ర పోషించిందని, ప్రత్యేక రాష్ట్ర సాధనకు జరుగుతున్న ఉద్యమాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారని గుర్తుచేశారు. ప్రజలు, మీడియా అందించిన సహకారంతోనే బీఆర్‌ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉందని, అధికారాన్ని కోల్పోయిన వెంటనే ఉద్యమ సమయంలో మీడియా చేసిన సేవలను మర్చిపోయి వారిపైనే దాడులు చేస్తామనడం సరికాదన్నారు. పదేళ్ల పాలనలో అక్రమాలు, అన్యాయాలు, దుర్మార్గాలు చేసి రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడి ఎందరో అమాయకుల వ్యక్తిగత జీవితాలతో ఆటలాడుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఓ నాయకుడు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించాడని, అందుకు సంబంధించిన ఆధారాలతో సహా బయటపెడతామన్నారు. వారికి త్వరలోనే శిక్ష పడేలా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు మహ్మద్ అలీఖాన్‌బాబర్, రఘునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, ఎండీ ఇబ్రహీం, దర్శన్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో వీఆర్‌ఏలు

కేశంపేట: చలో సీసీఎల్ఏ కార్యక్రమానికి వెళ్తున్న వీఆర్‌ఏలను మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన వీఆర్‌ఏలు శ్రీరాం, కృష్ణయ్య చలో సీసీఎల్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా పెట్రోలింగ్‌లో ఉన్న ఏఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది శ్రీశైలం గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

చేవెళ్ల: ఈ నెల 2, 3, 4 తేదీలలో నిర్వహించే కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ కళాశాలల 72 గంటల బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. దీనికి అన్ని కళాశాలల యాజమాన్యాలు సహకరించి బంద్‌ను పాటించాలన్నారు. 2024–25 సంవత్సరానికి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 7,200కోట్ల రూపాయలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రాక.. ఫీజులు చెల్లించలేక నానాఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రొఫెషనల్ కళాశాలలు విద్యార్థులు పరీక్షలు రాసిన సర్టిఫికెట్లు దగ్గరలేక ఉన్నత విద్యలకు దూరమవుతున్నారన్నారు. పెండింగ్‌లోఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

విభిన్న ఆవిష్కరణలను రూపొందించాలి

మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ



విద్యార్థులతో జేడీ లక్ష్మీనారాయణ

మొయినాబాద్: సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు సాంకేతికతను జోడించి వినూత్న ఆలోచనలతో విభిన్న ఆవిష్కరణలు రూపొందించాలని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం 'కేజీఆర్ ఐడియాథాన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. సామాజిక అంశాలతో ముడిపడి ఉన్న సమస్యలను సాంకేతికత ద్వారా అర్థవంతమైన, స్థిరమైన పరిష్కారాలను సృష్టించడంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు సామాజిక స్పృహ ఉండాలని, విద్య, పరిశ్రమ, పౌర సమాజ సంస్థలు, పర్యావరణ వ్యవస్థలపై అవగాహన పెంచుకొని వాటి అభివృద్ధి, మార్పు కోసం తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ సందర్భంగా 135 విద్యార్థి బృందాలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయి సత్యానారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, సీఐఎస్‌టీ హెడ్ సంయుక్త, కోర్ టీం సభ్యులు లింగం, శేషప్ప, మోహన్, రవికుమార్, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.